# త్రాగుబోతులు

ఎండ విచిత్రమైనది - దానికీ ఆవేశానికీ దగ్గరి చుట్టరికం.

ఎండ తీవ్రమై భరించరానిదైన కొద్దీ మనిషికి ఒకరకం ఉన్మాదం వస్తుంది. ఆవేశానికీ ఫలితమూ అలాటిదే. చల్లని వాతావరణ పరిస్థితుల నుంచి భారతదేశాన్ని ఏలడానికి వచ్చిన ఆంగ్లేయుల స్త్రీ జనం యిక్కడ 'ఎండాకాలపు ఉన్మాదా'నికి గురయ్యేవారట.

ఈవేళ కాచిన ఎండ యిక్కడే పుట్టి పెరిగినవారికి గూడా పిచ్చి ఎక్కించేట్లుగా ఉన్నది! రాత్రి పదిగంటలైనా గాలి చల్లబడలేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. చీకట్లో దేనికోసమో పొంచివున్న పిల్లిలాగున్నది.

సీతాదేవికి నిద్రపట్టడం లేదు. ప్రక్కగదిలో కోడలూ మెలకువగానే వుంటుందని ఆమెకు తెలుసు... నీలమోహన్ కోసం వేచివుండటమే ఆ యింటి లక్షణమైపోయిందీ మధ్యన!

సీతాదేవి పుస్తకం చేతిలోకి తీసుకుని మూడు వాక్యాలు చదివి ప్రక్కన పెట్టేసింది. సైడ్ లైటార్పేసి చీకట్లోకి చూస్తూ పడుకుంది. ఎన్నో ఆలోచనలు పుట్టినట్లే పుట్టి కొనలు సాగకుండా అసహనంలోకి విరిగిపోతున్నాయి.

'వాడు సవ్యంగా యింటికొస్తే... ఏమీ రభస లేకుంటే చాలు!' అనుకుంది నిరాశగా.

అంతలోనే గబుక్కున లేచి గది వాకిట్లోకి వచ్చి-

"ఒరే పాండూ! బాబుగారు వస్తున్నారు. పోయి తలుపు తియ్యి" అని కేకపెట్టింది. పాండు ఆవులించుకుంటూ లేచి "ఇంకా బాబుగారు బెల్లు వెయ్యలేదు కదండీ" అంటూ తలుపు దగ్గరికి వెళ్ళటం చూచి వెనక్కి వచ్చి పడుకుంది.

ఆమె పడుకున్నాక తలుపు తెరుచుకోవటం, నీలూ బూట్ల శబ్దం వినిపించింది. తను చెయ్యవలసిన ఒక పని తీరినట్లు నిట్టూర్చిందామె.

కోడలు అర్చన కేకలు వినిపించినై. "అక్కడే ఎక్కడైనా పడుకుని ఏకంగా తెల్లవారేక రారాదూ - ఇంట్లో అందరికీ నిద్రచేటు" అంటున్నాది.

"అయ్యో వాడు భోంచేశాడో లేదో అడక్కుండానే యీ గోల ఏమిటీ" అనుకుంది సీతాదేవి బాధగా.

"ఏదో ఒకవేళ ఇంటికి రాకపోతే మీరు మర్చిపోతారని భయం రాణీ" నీలమోహన్ గొంతులో నవ్వు.

"రాణీ, రాజా! బాగానే వుంది మైకం" అర్చన విసుగు విన్పించింది.

భోజనాల గదిలో లైటు వెలిగింది కాని మాట విన్పించలేదు. ఆ రాణీగారు వచ్చి వడ్డించదు. తాగిన మగతలో సరిగా తింటాడో లేదో వెళ్ళి వడ్డించుదామా అనిపించినా లేవకుండా అలాగే పడుకుండిపోయింది.

తను వెళ్తే కోడలు మండిపడుతుంది. అర్చన దృష్టిలో నీలూ తప్పులన్నీ సీతాదేవి అశ్రద్ధ వలనా, తెలివితక్కువతనం వలనా పుట్టినవే!

కాని యిది శుద్ధ అబద్ధం! నీలూని పసితనం నుంచీ ఎంతో జాగ్రత్తగా పెంచింది... ఉత్తమునిగా తీర్చిదిద్దాలని పెంచింది... త్రాగుడు అంటే అసహ్యించుకునేట్లు రూపొందాలని ఆశించింది... తండ్రి పోలిక రాకూడదని కోరుకుంది.

నీలూ ఇరవై మూడేళ్ళ వాడైనాక ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దవలసిన కాలేజి లెక్చరరైనాక ఒకనాటి రాత్రి ఆలస్యంగా యింటికొచ్చి కొద్దిగా తూలుతూ నవ్వుతూ "అమ్మా, నేను తొమ్మిదో క్లాసు చదువుతున్నప్పట్నుంచీ తాగుతూనే ఉన్నాను. నీకు తెలియదు! తాగితే తప్పేమీ లేదు... దిగులుపడకు... జీవితాన్ని తేలిగ్గా తీసుకోవాలి" అన్నాడు.

అప్పుడు తాను ఎంత నిరాశతో ఎంత వ్యర్థురాలిగా కుమిలిపోయిందో! తండ్రి పోలిక... జీన్స్... డి.యన్.ఎ. ప్రోగ్రాం... పెద్ద కొండకేసి తల కొట్టుకోవటం... ఏమీ ప్రయోజనం లేదు! ప్రయోజనం లేదు! పట్టుదలతో ప్రయత్నం చేసి ఓడిపోయింది!

"ఇంతవరకూ ఎక్కడో గడిపి యిప్పుడొచ్చాను యింటికి. ఇప్పుడూ వెళ్ళిపొమ్మనే అంటున్నావు... నేను యింటికి రానేవద్దా?" నీలూ గొంతులో నవ్వు.

ఎప్పుడే నవ్వేవాడికి! ఆ నవ్వూ, ఆ గొంతూ, ఆ మాటా వింటూంటే సీతాదేవి మనసులో సుళ్ళు తిరుగుతున్నది బాధో, ప్రేమో ఆమెకే తెలియటం లేదు. పాతికేళ్ళ క్రితం అదే గదిలో, అదే పరిస్థితిలో అర్చన స్థానంలో తానున్నది. నీలూ స్థానంలో నరేంద్ర ఉన్నాడు. అందువలన ఇప్పుడు అర్చన యివ్వబోయే సమాధానం ఆమెకు ముందే తెలుసు!

"ఈ వంశానికేదో శాపం వుంది. మీరందరూ యిట్లా నాశనమైపోయేవాళ్ళే! నాశనమైపోండి!... కాని నా కొడుకు!... వాడిని కాపాడుకోవాలని, యీ కశ్మలం వాడికి

అంటుగూడదని నా ఆరాటం!.... మీ నీడ వాడికి తగలకుండా వుంటే వాడు బాగుపడతాడని నా నమ్మకం... కనీసం యీ స్థితిలో వాడి కంటబడవద్దు!" అన్నది అర్చన స్థిరంగా.

ప్రశాంత్ లేచి ఏడవటం ప్రారంభించాడు.

"ఇది నా తప్పు కాదు రాణీ... వంశం తప్పు... క్రోమోజోముల మహాత్యం. ఏం చేద్దాం.. నువ్వు బాధపడకు... సరే. వెళ్తున్నానులే!"

అయ్యో, వాడెక్కడికి పోతాడు? అక్కడికే వెళ్ళి ఇంకా తాగుతాడు! చేజేతులా వాడిని మరింతగా ఆ ఊబిలోకి తోసేస్తున్న విషయం గ్రహించలేదు అర్చన! తను చేస్తున్న పనికి ఫలితం ఏమిటో తెలుసుకోలేక పోతున్నదెందుకు? ఎంత రాక్షసి అయిపోయింది!

గట్టిగా మాట్లాడటం కూడా చాతకానట్లు బహుసున్నితంగా కన్పించింది అర్చన మొదట్లో. కేవలం ఆ ఒక్క గుణం కోసమే కట్నం విషయం పట్టించుకోకుండా అర్చనను కోడలిగా ఎంచుకున్నది సీతాదేవి. తన కొడుకుకున్న ఒక్కలోటును సహించి వాడిలోని మంచితనాన్ని, ప్రేమను గుర్తించి వాడికి తోడు నీడయై, నిజమైన సహచారిణియై సరిదిద్దుతుందని ఆశించింది.

పెండ్లవగానే "చాల అదృష్టవంతురాలివే. అర్చనా! ఇహ నీ జీవితం నందన వనంలో విహారమే! నీవు కష్టమనేది ఎరక్కుండా హాయిగా వుంటావని మా నమ్మకం!" అర్చన స్నేహితులు అంటున్న మాటలు ప్రక్కగదిలోంచి విన్నప్పుడే సీతాదేవి మనసులో అపశ్రుతి తోచింది.

ఇవే మాటలు ఒకనాడు పెళ్ళికూతురిగా తానూ విని, తన జీవితం పూలబాటే అవుతుందని నమ్మింది.

తన జీవితయాత్ర పునరావృతం కాబోతున్నదా? వైవాహిక జీవితం ఒక మహాయజ్ఞం లాటిదనీ, తామిద్దరూ కలిసి కష్టసుఖాల్నీ, మంచి చెడ్డల్నీ ఎదుర్కోవలసి వుంటుందనీ స్పష్టంగా తెలిసినా మనసు యిలా కోరికల్లోనే ఉయ్యాలలూగుతుందేమిటి? నిజం కోసం చూడదే!

ఆమెకు జీవితం విచిత్రమూ అనివార్యమూ అయిన వలయంలాగ కన్పించింది. పరిస్థితులు ఏ దిక్కుకు నెట్టితే అటు నడుస్తూ పోయే కీలుబొమ్మ మనిషి!

నీలమోహన్ వెళ్ళిపోయాడు.

సీతాదేవి లేచి కోడలి దగ్గరకు వచ్చింది.

"అమ్మా అర్చనా, వాడిని తరిమేసి నీ కొడుకును నీవు బాగుచేసుకోలేవు. ఈ ప్రయత్నమే నేనూ చేశాను. అది జరగదు!... నీ మొగుడు వేరూ నీ కొడుకు వేరూ కాదు! నీ

మంచితనంతో, ప్రేమతో నీ మొగుణ్ణి దారికి తెచ్చుకో. నీ కొడుకు బాగుపడతాడు! నీలూని చెయ్యి విడవకమ్మా!" అన్నది శాంతంగా.

"దయచేసి నా విషయంలో జోక్యం చేసుకోవద్దు! నాకు తోచినట్లు నేను చేసుకుంటాను నా ఖర్మకు ఏడ్చుకుంటూ...!" అర్చన కోపంగా అన్నది.

అర్చనకు అర్థం కాదు! ఒక పరిస్థితిలో యిరుక్కున్న మనసు తన స్థాయి నుంచీ ఒక రకంగానే ఆలోచిస్తుంది. కార్యకారణ సంబంధాలు నిర్ధారణ చేస్తుంది...

అనుభవం ఒక్కటే మనిషికి పాఠం నేర్పగల శక్తిగలది-పరిస్థితులు అనివార్యంగా ముందుకు జరిగాక!

కాని ఆశ మనిషిని ముందుకు నడిపిస్తూనే ఉంటుంది. ఆవేశం తగ్గాక అర్చనకు నిదానంగా అర్థం కావచ్చునేమో! ఎవరు చెప్పగలరు!...

జీవితం అనే కొలిమిలో తను కోరుకోని అనుభవాల సమ్మెట పోట్లతో తన కోరికల్తో, ఆలోచనల్తో సంబంధం లేని క్రొత్తరూపం దిద్దుకుంటాడు జీవి. ఆ జీవికి ఏ అనుభవం అవసరమో ఆ రూపాన్ని నిర్దేశించే జీవశక్తికే బాగా తెలుస్తుంది! అనుకుంటూ వేదాంతంలోకి మునిగిపోయిందామె.

ఎవరూ నిద్రపోకుండానే తెల్లవారిపోయింది.

వీధి వాకిలి ఊడ్చుతున్న పాండుతో వసారా అరుగు చివర్న ధీమాగా నిలబడి తన ఆలోచనల్ని ప్రకాశం చేసుకుంటూ చెప్పుకుపోతున్నాడు నాలుగేళ్ళ పెద్దమనిషి ప్రశాంత్.

"నాన్నంత పెద్దయ్యాక నేను నాన్నగారికి మల్లే తాగేత్తా... అప్పుడు ఎందుకు యింటికి రావటం అసలు... నేనింటికి రానేరాను... ఎక్కడో అక్కడ హాయిగా వుండిపోతా!" భవిష్యత్‌లోకి చూస్తున్న యోగిపుంగవుడిలా సాలోచనగా చూస్తూ ఏమాత్రం సందేహం లేకుండా వరుసగా చెప్పుకు పోతున్నాడు.

అర్చన విసురుగా వచ్చి వెనుకనుంచి వేసిన దెబ్బకు గట్టు మీదనుంచి క్రిందకు పడిపోయాడు. నుదురు చిట్లి రక్తం ధారకట్టింది. 'అయ్యో' అనుకుంటూ గాబరాగా క్రిందికి దిగి వాడిని ఎత్తుకున్నది అర్చన.

"సరిగ్గా నిలబడటం రాదు వెధవకి" అని గొణుక్కుంటూ నీళ్లతో మొహం కడిగింది.

సీతాదేవికి కోడల్ని చూస్తే జాలేసింది.

"అమ్మాయ్, నీ ఆవేశంతో వాడిని బాగుచెయ్యలేవు. ఎండలో ప్రతి వస్తువుకీ నీడ వున్నట్లు మనసులోని ప్రతి అభిప్రాయానికీ ఆలోచనకీ ప్రతిరూపాలు ఏర్పడుతాయి.

తప్పదు. ఒక ఆలోచన వెనుక ఆవేశం వున్నకొద్దీ దాని ప్రతిరూపం మరింత శక్తివంతమౌతుంది. ఈ ద్వంద్వరూపాల్తో కూడిన జీవితం దట్టమైన అడవిలాటిది... అయినా ప్రేమ అన్న దీపం, విశ్వాసం అన్న ఊతకర్రల సాయంతో మనిషి ఈ అడవిలో దోవ ఏర్పరుచుకోవచ్చు. కోపంతో కాక మంచితనంతో పని జరుపుకోమ్మా" అన్నది.

అర్చన మాట్లాడకుండా కొడుకు నెత్తుకొని లోపలికెళ్ళి పోయింది.

ఉబ్బిన మొహం మీద చిన్న బాండ్ ఎయిడ్ పట్టీ వేసుకుని సబ్బునీళ్ళ సీసానీ, సన్న పూచిక గొట్టాన్నీ పట్టుకొచ్చాడు ప్రశాంత్. ఐదు నిముషాల క్రింది దెబ్బనీ, ఏడుపునీ పూర్తిగా మర్చిపోయినట్లున్నాడు. దీక్షగా బుడగల్ని పుట్టిస్తూ నేల మీద పేర్చుతూ కొండ కట్టడం ప్రారంభించాడు.

ఎండ వెలుగులో బుడగలు వజ్రాల్లా మెరుపులు చిమ్ముతూ వున్నాయి... వాటి చిన్ని జీవితకాలాల్ని అతి తేలిగ్గా, ఆటకాయతనంగా వెచ్చించుతున్నవి. ఆమె దృష్టి క్రమంగా ఆ మెరుపుల కొండ మీద కేంద్రీకృతమై ఆనందపూర్ణమైంది... ఆ వజ్రాల కొండ ఒక నవ్వులగని! - ఒక అదృశ్య శక్తి విలాసం! అది అపూర్వ సౌందర్యంతో సమ్మోహనంగా వున్నది. స్థిరత్వంలో నిరంతర చలనంగా వున్నది. అందులో అతి పలుచని వెండి నీటి బుడగల గోళార్థాలు ఏర్పడుతూ చిట్లుతూ వున్నవి. అలా పుడుతూ, చిట్లుతూ వుంటే, ఆ శక్తి అలాగే నవ్వుతూ, ఆడుతూ... ఆ బుడగలు పుడుతూ చిట్లుతూ, చిట్లుతూ పుడుతూ.... అందులో తానూ ఒక బుడగ అయిపోయిందామె...

'జీవితాన్ని తేలిగ్గా తీసుకోవాలి - ఆ బుడగల్లా గడపాలి' అనుకుంది.

అవి తన కొడుకు నీలూ చెప్పే మాటలని జ్ఞాపకం వచ్చింది... ఆ కన్పిస్తున్న వజ్రాల కొండ నీలమోహన్. ఆ నవ్వులు, ఆ స్వేచ్ఛత, ఆ చురుకు, ఆ మెరుపు అన్నీ, అన్నీ వాడే!! కాని...

సూర్యుడు ఆకాశపు నిచ్చెన ఎక్కుతున్నాడు. ఎండ తీక్షణమౌతూ నీడలు చిక్కనై భౌతిక సత్యాల్లా కన్పిస్తున్నవి. ప్రశాంత్ బుడగల ఆట వదిలేసి ఆ నీడల్ని దోసిళ్ళతో పట్టుకుంటూ ఆడుకుంటూ వున్నాడు.

నీడకీ, నిజానికీ భేదం అక్కర్లేని ప్రశాంత్‌కి జీవితం ఒక ఆట!

నీడకీ నిజానికీ వెనుకనున్న తత్వం అందుకున్న వారికీ జీవితం ఒక ఆట!

దాన్ని గుర్తిస్తే నాలోంచి దుఃఖం, అర్చనలోంచి ఆవేశం, సంఘంలో నుంచి తిరస్కారం జారిపోవచ్చు. నీలూ వారసత్వం మీదా, పరిసరాల మీదా విజయం సాధించవచ్చు! ఆ గుర్తు తెలిసేవరకూ అందరూ పరిస్థితుల వలయంలో అదే

కీలుబొమ్మలు! రకరకాల త్రాగుబోతులు! అనుకుంది సీతాదేవి.

సరిగ్గా అప్పుడే - మొదటిసారిగా

ఇద్దరు మనుషులు నీలమోహన్‌ని ఇంట్లోకి మోసుకొచ్చారు!

★★★